సాక్షి
బాపట్ల
మంగళవారం : 21 : మే : 2024



వైభవంగా కలశాభిషేకం

బాపట్ల: శ్రీ భావపురి శ్రీనివాస శ్రీ విఖనస ఆశ్రమంలో లోక కల్యాణార్థం సోమవారం మహాశాంతి పూర్వక అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు.



రంగనాథుడి కల్యాణ ఉత్సవాలు

యద్దపాడు: సొలసలోని రంగనాయకస్వామి ఆలయంలో సోమవారం శ్రీలక్ష్మీ అమ్మవారికి 54 రకాల వస్తువులతో పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన బండ్లమ్మ కొలుపులు



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులో శ్రీబగళాముఖి బండ్లమ్మ అమ్మవారి కొలుపులు ఆదివారం రాత్రి ముగిశాయి. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

న్యూస్‌రీల్

వైభవంగా మొగదారమ్మ ఉత్సవాలు ప్రారంభం



నిజాంపట్నం: మత్స్యకారుల ఇలవేల్పు మొగదారమ్మ తల్లి సిడిమాను ఉత్సవాలు నిజాంపట్నంలో సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు పాల్గొంటారు. ఉత్సవాలను పురస్కరించుకుని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు,ఆయన సోదరుడు మోపిదేవి హరనాథబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకట రమణారావు మాట్లాడుతూ మొగదారమ్మ తల్లి సిడిమాను ఉత్సవాల్ని ఏటా అంగరంగవైభవంగా నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లను చేసినట్లు ఆయన తెలిపారు.

ఉత్సాహంగా జల క్రీడలు

ఉత్సవాలను పురస్కరించుకుని తొలిరోజు ఉత్సాహంగా జల క్రీడలు నిర్వహించారు.

25 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

నగరం: స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థాన 14 వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 25నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు సోమవారం తెలిపారు.బ్రహ్మోత్సవాల్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు,హోమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూజల అనంతరం ప్రతిరోజు అన్నదానం చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

మార్టూరు: నాడు–నేడులో భాగంగా పెండింగ్‌లో ఉన్న పనుల్ని త్వరగా పూర్తి చేయాలని విద్యాశాఖ జిల్లా ప్రతినిధి ఏ.ఎల్.ఎస్.ఓ. సాగర్ సూచించారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో సోమవారం ఆయన మార్టూరు, యద్దనపూడి, బల్లికురవ, సంతమాగులూరు మండలాల అధికారులతో నాడు–నేడు పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సాగర్ ఇసుక ఇన్వాయిస్, ఇండెంట్, పెండింగ్‌లో ఉన్న ఇతర పనులు, ఐఎఫ్‌పీ ప్యానల్స్ వివరాల గురించి సమీక్షించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంఈవోలు, సీఆర్పీలు పాల్గొన్నారు.


ఈవీఎంలకు మూడంచెల భద్రత

బాపట్ల టౌన్: జిల్లావ్యాప్తంగా బాపట్ల లోక్‌సభ, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, (ఈవీఎం) కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచిన విషయం తెలిసిందే. ఈ స్ట్రాంగ్ రూముల వద్ద ఎస్పీ వకుల్‌జిందాల్, కలెక్టర్ పి. రంజిత్‌బాషా ఆధ్వర్యంలో పటిష్టమైన మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. మొదటి అంచెలో కేంద్ర సాయుధ బలగాలు, రెండో అంచెలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు, మూడో అంచెలో స్థానిక పోలీసులతో మూడు షిఫ్టుల్లో 24 గంటలూ భద్రత కల్పిస్తున్నారు. నిరంతర నిఘాకు సీసీ కెమెరాలు కూడా అమర్చారు. వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు పూర్తయ్యేంత వరకూ అత్యంత కట్టుదిట్టమైన భద్రతతో నిరంతర పోలీసు పహారా ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు.

పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా చోరీ

చీరాల అర్బన్: చీరాల రూరల్ మండలం పుల్లాయపాలెంలోని పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరా చోరీకి గురైంది. ఈపూరుపాలెం రూరల్ పోలీసుల వివరాల మేరకు.. పుల్లాయపాలెంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్‌లో రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే, అందులో ఒకటి కనిపించలేదు. మహిళా పోలీసు ధనలక్ష్మి సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఈపూరుపాలెం ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 504.80 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 806.60 అడుగుల వద్ద ఉంది.

మారీచ్‌లపై ఉక్కుపాదం

- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా
- కృష్ణానదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై నిఘా
- ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి తనిఖీలు



కొల్లూరు మండలం జువ్వలపాలెం ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్

కొల్లూరు : కృష్ణా నదిని కొల్లగొడుతున్న ఇసుక మారీచుల ఆటకట్టించేందుకు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ యంత్రాంగం ఉక్కుపాదం మోపాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశాలు జారీ చేశారు. ఆయన సోమవారం మండలంలోని జువ్వలపాలెం ,గాజుల్లంకతో పాటు అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టిన పెదలంక ఇసుక క్వారీల్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి పరిశీలించారు. ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు పలు ప్రభుత్వ శాఖల అధికారులతో కలసి క్వారీల్ని పరిశీలించి పలు ఆదేశాలు జారీ చేశారు. కృష్ణా నదిలో అక్రమ ఇసుక తవ్వకాలు చేపట్టకుండా పకడ్బందీగా వ్యవహరించాలని మైనింగ్, రెవెన్యూ, పోలీస్, సెబ్ అధికారుల్ని ఆదేశించారు. జువ్వలపాలెంలో గతంలో చేపట్టిన ఇసుక తవ్వకాలపై ఆరా తీశారు. ప్రస్తుతం చేపట్టకుండా నిరోధించాలని, నదీ ప్రాంతంలో వెబ్‌క్యామ్‌ల ఏర్పాటుతో పాటు నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని మైనింగ్ అధికారుల్ని ఆదేశించారు. ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణాపై అధికారుల్ని ప్రశ్నించారు. స్థానికులు చేస్తున్నారని అధికారులు ఆయన దృష్టికి తీసుకురావడంతో వాహనాలపై కఠిన కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పెసర్లంక అరవిందవారధి, పెదలంక పరిధిలో ఇసుక తవ్వకాలు చేపట్టడానికి అనువుగా ఉన్న ఈపూరు పొలిమేర డొంక మార్గాలతో పాటు, నదీ పరీవాహక గ్రామాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలు దిగకుండా ర్యాంపుల వద్ద గండ్లు చేయాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీసు సిబ్బంది బృందాలుగా ఏర్పడి అరికట్టేలా చర్యలు చేపట్టాలని కొల్లూరు తహసీల్దార్ పుల్లారావును ఆదేశించారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్డీవో హేలా షారోన్, రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ, వేమూరు సీఐ రామకృష్ణ, కొల్లూరు ఎస్‌ఐ రవీంద్రరెడ్డి, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు

రేపల్లె రూరల్: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. మండలంలోని పెనుమూడి ఇసుక రీచ్‌ను సోమవారం ఆయన ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి పరిశీలించారు. అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. పెనుమూడి కృష్ణానది తీరం వెంబడి నుంచి ఇసుక తరలించేందుకు ప్రస్తుతం ఎటువంటి రీచ్‌లకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. కృష్ణా తీరం వెంబడి రెవెన్యూ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఇసుక తరలింపుల్ని అడ్డుకోవాలని సూచించారు. రేపల్లె, భట్టిప్రోలు, కొల్లూరు మండలాలలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. అక్రమంగా ఇసుక తరలించే వారితో పాటు వారికి సహకరించే అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఆయన వెంట ఆర్డీవో హేలా షారోన్, తహసీల్దార్ రవీంద్ర, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై క్రిమినల్ చర్యలు



ఓలేరు రీచ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో హేలా షారోన్, రెవెన్యూ అధికారులు

భట్టిప్రోలు: ఇసుక అక్రమ తవ్వకాలపై క్రిమినల్ చర్యలు తీసుకుని వాహనాల్ని సీజ్ చేయాలని రేపల్లె ఆర్డీవో హేలా షారోన్ పోలీసుల్ని ఆదేశించారు. సోమవారం భట్టిప్రోలు మండలంలోని ఓలేరు, పెదలంక కాకుల డొంకలో రీచ్‌లను పరిశీలించారు. రాత్రిపూట ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని రెవెన్యూ, పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. రీచ్‌లలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి గస్తీని ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు రీచ్‌ల వద్ద పరిరక్షణ చర్యలు చేపట్టాలని, సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆమె వెంట మైనింగ్ ఏడీ రాజేష్, రివర్ కన్జర్వేషన్ అధికారి భానుబాబు, ఏఈ నాయక్, తహసీల్దార్ ఐ. మునిలక్ష్మి, సర్వేయర్ బి. శ్రీనివాసరావు ఉన్నారు.

ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలి

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని అనమనమూరులో ఇసుక రీచ్‌ను జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తవ్వకాల్ని నిషేధించాలని, దానికి తగిన చర్యలు తక్షణమే చేపట్టాలని అధికారుల్ని ఆదేశించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు పోలీసుల నిఘా పెంచాలని అధికారులకు సూచించారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న దారిని మూయించాలని ఆదేశించారు. ఆయన వెంట జేసీ శ్రీధర్, ఆర్డీవో శివరామకృష్ణారెడ్డి, తహసీల్దార్ సుశీల, పోలీసు అధికారులు, ఎస్‌ఐలు ఉన్నారు.



అనమనమూరులో ఇసుక రీచ్‌లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

సత్తా చాటిన బల్లికురవ ఎడ్ల జత



రాయిని లాగుతున్న ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్ల జత

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని రామాపురంలో పట్టాభిరామస్వామి, గ్రామ దేవత పేరంటాళ్ల తిరునాళ్ల సందర్భంగా గ్రామానికి చెందిన నారా వీరారెడ్డి, సిద్ధమ్మ కుటుంబ సభ్యులు సోమవారం ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అంబాల చిన వెంకటరెడ్డి ప్రారంభించారు. పోటీలో మొత్తం ఐదు జతల ఎడ్లు పాల్గొన్నారు. బాపట్ల జిల్లా బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరాస్వామి ఎడ్లజత పందెపు రాయిని నిర్దేశిత సమయంలో 1,589 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలించింది. ప్రకాశం జిల్లా టంగుటూరు గ్రామానికి చెందిన మక్కెన కోటేశ్వరరావు ఎడ్లజత 1551.3 అడుగులతో ద్వితీయ స్థానం, గిద్దలూరు మండలం కొండపేటకు చెందిన మీనిగ కాశయ్య ఎడ్లజత 1157 అడుగులు లాగి తృతీయ స్థానంలో నిలిచాయి. బల్లికురవ పావులూరి వీరాస్వామికి చెందిన మరో జత 1023 అడుగుల లాగి నాలుగో స్థానం, నంద్యాల జిల్లా బేతంచెర్లకు చెందిన మేకల వెంకట్రాముడు ఎడ్లజత 927 అడుగులు లాగి ఐదో స్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతులు వరుసగా ప్రథమ రూ.50 వేలు, ద్వితీయ రూ.40 వేలు, తృతీయ రూ.30 వేలు, 4, 5 స్థానాల్లో నిలిచిన వారికి ప్రోత్సాహకంగా చెరో రూ.5 వేలను నారా కుటుంబసభ్యులు నారా పెద సిద్దారెడ్డి, చిన సిద్దారెడ్డి, బాల సిద్దారెడ్డి, సిద్దారెడ్డి అందజేశారు.



బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

పచ్చ రాక్షసం

మాచర్ల టార్గెట్‌గా 'దేశం' ఆపరేషన్ దమనకాండ

- మద్దతుగా నిలిచిన పోలీసు అధికారులు
- స్పందించని నాటి జిల్లా కలెక్టర్
- ఎన్నికలు ముగిసిన తర్వాత ఘర్షణలకూ వారే కారణం
- సిట్ బృందానికి ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ





ఎన్నికల సందర్భంగా రెంటచింతల మండలంలో జరిగిన టీడీపీ మూకల దాడుల్లో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: మాచర్లలో జెండా పాతడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ చేసిన ఆపరేషన్‌కు పోలీసు ఉన్నతాధికారులు, సర్కిల్ అధికారులు అండగా నిలిచారు. పోలింగ్ రోజు, తదనంతరం అక్కడ జరుగుతున్న పరిణామాలపై ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేస్తున్నా డీజీపీ గానీ, అప్పటి ఎస్పీ గానీ, కలెక్టర్‌గానీ స్పందించకపోవడం దీన్ని బలపరుస్తోంది. తెలుగుదేశం పార్టీ తమ సామాజిక వర్గం అధికంగా ఉన్న గ్రామాల్లో మొదటి నుంచి వ్యూహాత్మకంగా రిగ్గింగ్ చేయడానికి సన్నాహాలు చేసుకుంది. చివరి నిముషంలో అదే సామాజిక వర్గానికి చెందిన అధికారినీ తీసుకురావడంతో ఆ పార్టీ నేతలు మరింత రెచ్చిపోయారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల తర్వాత కూడా మాచర్ల రణరంగంగాన్ని తలపించింది. టీడీపీ కుట్రలు, కుయుక్తులపై వైఎస్సార్ సీపీ బృందం సోమవారం ఎన్నికల సంఘం నియమించిన స్పెషల్ ఇన్విస్టిగేషన్ టీం(సిట్) అధినేత వినీత్ బ్రిజ్‌లాల్‌కు ఫిర్యాదు చేసింది.

ఫ్యాక్షన్ జూలు విదిల్చిన జూలకంటి

జూలకంటి బ్రహ్మానందరెడ్డిని టీడీపీ మాచర్ల ఇన్‌చార్జిగా ప్రకటించినప్పటి నుంచి అక్కడ మళ్లీ ఫ్యాక్షన్ ఊపిరి పోసుకుంది. ఎప్పుడైతే ఆయనను టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిందో అప్పటి నుంచి నియోజకవర్గంలో ఆయన సమస్యలు సృష్టించడం మొదలుపెట్టారు. మాచర్లను కైవసం చేసుకోవాలంటే పల్నాడు జిల్లాలో అప్పుడు ఉన్న ఐజీ, ఎస్పీ ఇతర అధికారులు ఉంటే సాధ్యం కాదని జూలకంటి, టీడీపీ అధినాయకులు గుర్తించారు. దీంతో వారు ఆ ఎస్పీని టార్గెట్‌గా చేసుకున్నారు. ఆయన ఉంటే బూత్ క్యాప్చర్, ఓటర్లను భయపెట్టడం కుదరని అభిప్రాయపడ్డారు. అప్పుడే పొత్తు పెట్టుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి ద్వారా పావులు కదిపారు. జిల్లాలో రెడ్డి, ఎస్సీ అధికారులు ఉంటే తమ పన్నాగం పారదని, వారిని మార్చాలని ఒత్తిడి తీసుకువచ్చారు. ఐజీ పాల్‌రాజ్‌ను బదిలీ చేసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించకపోయినా గత తెలుగుదేశం ప్రభుత్వంలో చక్రం తిప్పిన ఒక అధికారికి సన్నిహితంగా ఉండే అధికారిని తీసుకువచ్చి పోస్టింగ్ ఇప్పించారు. పల్నాడు ఎస్పీగా గతంలో సెబ్ అడిషనల్ ఎస్పీగా పనిచేసిన బిందుమాధవ్‌ను తీసుకువచ్చారు. వారు వచ్చిన తర్వాత కిందిస్థాయి సిబ్బందికి తెలుగుదేశం నాయకులను టచ్ చేయవద్దంటూ మౌఖిక ఆదేశాలు వెళ్లాయి.

పేట్రేగిపోయిన పచ్చమూకలు

11న రెంటచింతలకు వెళ్లిన సీఐ నారాయణస్వామి తెలుగుదేశం నేతలకు మీ ఇష్టం వచ్చినట్లు ఎన్నిక నిర్వహించుకోండని చెప్పినట్లు సమాచారం. దీంతో టీడీపీ నేతలు పేట్రేగిపోయారు. అదేరోజున కారంపూడి మండలం వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డిపై దాడి చేసి బెదిరించారు. వేపకంపల్లిలో తెలుగుదేశం నేతలు మహేష్ అనే వ్యక్తిపై ఆరోపణలు చేసి అతనిపై దాడి చేస్తే తొలుత ఒక హెడ్ కానిస్టేబుల్‌ను పంపారు. ఆ తర్వాత సీఐ వెళ్లి మహేష్‌ను కరెంట్ స్తంభానికి కట్టేయించి అవమానించారు. 12న రెంటచింతలలో నారాయణస్వామి ఉండగానే తెలుగుదేశం నేతలు మోర్తాల ఉమామహేశ్వరరెడ్డిపై దాడి చేశారు. రెంటచింతల మండలం పాలువాయిగేట్ పోలింగ్‌స్టేషన్ 201,202 వద్ద టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ ఏజెంట్లనూ అనుమతించలేదు. తొమ్మిది గంటల సమయంలో ఐజీ శ్రీకాంత్ జోక్యంతో ఏజెంట్లను అనుమతించారు. జెట్టిపాలెంలో 214, 217 పోలింగ్ బూత్‌లలోకి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లను అనుమతించలేదు. దీనిపై గ్రామస్తులు ప్రశ్నించినప్పుడు సీఐ నారాయణస్వామి వచ్చి వైఎస్సార్ సీపీ ఏజెంట్లను భయపెట్టి బయటకు పంపారని గ్రామస్తులు చెబుతున్నారు. తుమ్మకోటలో టీడీపీ రిగ్గింగ్‌కు పాల్పడినప్పుడు ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈవీఎంలూ ధ్వంసమయ్యాయి. ఆ తర్వాత కొత్త ఈవీఎంలు పెట్టి వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు లేకుండానే ఎన్నిక కొనసాగించారు. వెల్దుర్తిలోని 137, 138, 139, 140, 141 పోలింగ్ స్టేషన్లలో రాత్రి ఏడు గంటల తర్వాత వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బయటకు పంపి రిగ్గింగ్ చేశారు. దీనిపై ఎస్పీకి ఫిరాదు చేసినా స్పందించలేదు. ఒప్పిచర్లలో 250,251,252, 256 పోలింగ్ స్టేషన్లలో ఇతర సామాజిక వర్గాల వారు ఓటు వేసుకోలేని పరిస్థితి నెలకొంది.

'నారా'యణస్వామి భక్తి

కారంపూడి సర్కిల్‌లో కారంపూడి, రెంటచింతల, దుర్గి పోలీసుస్టేషన్లు ఉన్నాయి ఇక్కడ బీసీ వర్గానికి చెందిన సీఐ చినమల్లయ్య సమర్థంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇతన్ని అర్ధంతరంగా ఎన్నికల ముందు బదిలీ చేశారు. ఆయన స్థానంలో తమ సామాజిక వర్గానికి చెందిన నారాయణస్వామిని తీసుకువచ్చి అక్కడ పోస్టింగ్ ఇప్పించుకున్నారు తెలుగుదేశం నాయకులు. ఆయన వచ్చీరాగానే తన సామాజికవర్గ నాయకులకు పగ్గాలు ఇచ్చేశారు. ఎన్నికల్లో మీరు ఎలాగైనా పనిచేసుకోవచ్చని తెలుగుదేశం పార్టీలోని నాయకులకు అభయం ఇచ్చేశారు. ఆయన ఫోన్ కాల్, వాట్సప్, ఫేస్‌టైమ్ డేటాను పరిశీలిస్తే ఆయన తెలుగుదేశం పార్టీకి ఏవిధంగా పని చేసింది అర్థమవుతుందని వైఎస్సార్ సీపీ బృందం తన ఫిర్యాదులో పేర్కొంది.

దాడులకు పాల్పడినా చర్యల్లేవు



ఈనెల 14న కారెంపూడి బస్టాండ్ వైపు దూసుకు వస్తున్న టీడీపీ మూకలు

వెల్దుర్తి పరిధిలో కొందరు టీడీపీ నేతలు పోలీసు కానిస్టేబుళ్ల మీద చేయి చేసుకున్నట్లు ఫిర్యాదు రిజిస్టర్ అయినా దాడి చేసిన వారిని కనీసం స్టేషన్‌కు కూడా పిలవలేదు. ఎన్నికల ముందు బైండోవర్ కూడా చేయలేదు. ఎన్నికలకు మూడు రోజుల ముందు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భార్య శిరిగిరిపాడు గ్రామంలో ప్రచారం చేస్తుండగా ఆమెపై దాడి చేశారు. బందోబస్తుగా వచ్చిన ఎస్‌ఐ ఇతర పోలీసు సిబ్బందిపై కూడా తెలుగుదేశం నేతలు దాడి చేశారు. దీనిపై రెండు ఫిర్యాదులు వచ్చినా దాడి చేసిన వారిని ఎవరినీ పోలీసుస్టేషన్‌కు పిలవలేదు. పైగా బాధితుడైన ఎస్‌ఐతోపాటు కారంపూడి, మాచర్ల టౌన్ సీఐలను బదిలీ చేశారు. దీంతో పోలీసుల్లో అభద్రతా భావం ఏర్పడింది. దీన్ని అడ్డం పెట్టుకుని తెలుగుదేశం నాయకులు గ్రామాల్లో రెచ్చిపోయారు. రెంటచింతలలో సుమారు రెండు లక్షల హోలోగ్రామ్ ఉన్న ఓటర్ స్లిప్‌లను స్వాధీనం చేసుకుంటే కలెక్టర్ చర్యలు తీసుకోకపోగా బస్‌ను కూడా సీజ్ చేయకుండా వదిలేశారు. ఈ మొత్తం వ్యవహారంలో ఎస్పీ బిందు మాధవ్‌తోపాటు కొంతమంది అధికారులపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకున్నా, ఎన్నికల్లో ఏకపక్షంగా వ్యవహరించిన మరికొందరు అధికారులను కొనసాగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిందితులను 48 గంటల్లో అరెస్టు చేస్తాం

జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మలికా గార్గ్



నరసరావుపేట: ఎన్నికల సందర్భంగా నమోదైన కేసుల్లోని నిందితులను వచ్చే 48 గంటల వ్యవధిలో అరెస్టు చేస్తామని జిల్లా నూతన ఎస్పీ మలికా గార్గ్ చెప్పారు. సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించేందుకు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన ఆమె పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా జరిగిన హింసాత్మక సంఘటనల కారణంగా చండీఘర్‌లో పనిచేస్తున్న తాను ఇక్కడకు రావాల్సి వచ్చిందన్నారు. జిల్లాలో 144 సెక్షన్‌ను గట్టిగా అమలుచేస్తామన్నారు. శాంతిభద్రతలు మామూలు స్థితికి వచ్చేందుకు పోలీసులు తీసుకునే చర్యలకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వాటికి విఘాతం కలిగించే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా పోలీసు విభాగంలో పనిచేస్తున్న వారిపై కూడా శాఖాపరమైన చర్యలకు వెనుకాడబోమని అన్నారు. అందరమూ కలిసి జిల్లా ఖ్యాతిని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవిస్తూ దానికి అనుగుణంగా వ్యవహరించాలని కోరారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ లత్కర్ శ్రీకేశ్ బాలాజీరావును మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

వైభవంగా నృసింహస్వామి జయంత్యుత్సవాలు



మంగళగిరి: పట్టణంలోని లక్ష్మీనృసింహస్వామి జయంత్యుత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు సోమవారం ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యావాహచనం, అగ్ని ప్రతిష్ఠ నరసింహమూల మంత్ర హోమం, సాయంత్రం ఆరు గంటలకు విష్వక్సేన పూజ, అగ్నిప్రణయనం, కుంభారాధన, నారసింహ హోమం పూజలు చేశారు. అనంతరం స్వామికి గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

క్విజ్ పోటీల్లో ఐశ్వర్య ప్రతిభ



ఐశ్వర్యను అభినందిస్తున్న హెచ్ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు

నగరం: ఇటీవల చీరాలకు చెందిన గీతా యంగ్ సైంటిస్ట్ సంస్థ ఆన్‌లైన్‌లో జిల్లాస్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించింది. ఇందులో అల్లపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.ఐశ్వర్య ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం ఆమెను హెచ్ఎం వై. రాజేశ్వరి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.వి. శ్రీనివాసరావు, నరేంద్రబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై అట్రాసిటీ కేసు

తాడికొండ: తుళ్లూరు మండలం వడ్లమానులో ఎస్సీ కులానికి చెందిన కారంశెట్టి వెంకట్రావు ఇంటిపైకి వెళ్లి దాడి చేసిన ఐదుగురు టీడీపీ నాయకులపై తుళ్ళూరు పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన గోళ్ళ గోపీనాథ్ రెడ్డి, చిలుకూరి జగదీష్‌రెడ్డి, చల్లా మన్మథరెడ్డి, ఉయ్యూరు రాజశేఖరరెడ్డి, చల్లా వెంకట నరసింహారెడ్డి ఎన్నికల ముందు రోజు సెంటర్‌కు వచ్చిన కారంశెట్టి వెంకట్రావును టీడీపీకి ఓట్లు వేయాలని అడగ్గా ఆయన నిరాకరించాడు. ఆ సమయంలో వివాదం జరిగింది. దీంతో ఆగ్రహించిన వారు వెంకట్రావు ఇంటిపైకి వెళ్ళి కులం పేరుతో దూషించడంతోపాటు తల నరికి సైలెన్సర్‌కు వేలాడదీసుకొని వెళతానని బెదిరించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీహెచ్ అనురాధ తెలిపారు.

భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలి

- టంగుటూరి ప్రకాశం పంతులు ముని మనవరాలు సుభాషిణి
- 'భారతీయ మహిళామణులు' పుస్తకావిష్కరణ
- 143 మంది విద్యార్థులకు బహుమతి ప్రదానం



బహుమతులు అందుకున్న విద్యార్థులు

అద్దంకి: విద్యార్థులు చక్కగా చదివి భవిష్యత్‌లో గొప్పగా ఎదగాలని ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు మునిమనుమరాలు సుభాషిణి సూచించారు. ఆమె సోమవారం పట్టణంలో సాహితీ మిత్ర మండలి ఆధ్వర్యంలో వాసవీ నగర్‌లోని శ్రీనివాస కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రకాశం పంతులు జయంతికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బంగ్లా రోడ్డులోని ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకాశం మునిమనుమరాలుగా పుట్టడం తన అదృష్టమని పేర్కొన్నారు. ఆయన గొప్ప సాహసవంతుడని చెప్పారు. సంకా సుబ్రహ్మణ్యం సౌజన్యంతో విద్యార్థుల కోసం 'భారతీయ మహిళామణులు' జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇందులో మహిళామణులు చరిత్రలతోపాటు సృజన కవుల కవితలను పొందుపరచారు. పదో తరగతిలో 550 మార్కులకుపైగా సాధించిన 143 మంది విద్యార్థులకు బహుమతులు, అత్యుత్తమ మార్కులు సాధించిన 31 మందికి నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఊటుకూరి ఉమా అన్నపూర్ణ, వీరవల్లి సుబ్బారావు, డాక్టర్ యు. దేవపాలన, అన్నమనేని వెంకట్రావు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, ఇలపావులూరి శేషతల్పసాయి, షేక్ మహ్మద్ రఫీ, రోటరీ క్లబ్ సభ్యులు ఊటూకూరి రామకోటేశ్వరరావు, సాహితీ మిత్రమండలి సభ్యులు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ చెరువులో అక్రమంగా తవ్వకాలు

- బరి తెగించిన చందలూరు టీడీపీ నాయకులు
- వచ్చేది తమ ప్రభుత్వమేనని దురుసు ప్రవర్తన
- అడ్డుకున్న అధికారులు



చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు

జే.పంగులూరు: దేవదాయ శాఖ భూముల్లో తెలుగుదేశం నాయకులు అక్రమంగా చేపట్టిన మట్టి తవ్వకాల్ని అధికారులు అడ్డుకున్నారు. మండలంలోని చందలూరు గ్రామంలో దేవదాయ శాఖ కింద 20 ఎకరాల మేర ఊర చెరువు ఉంది. ఇందులోని మట్టిని గ్రామంలోని కొందరు టీడీపీ నాయకులు ఆదివారం అక్రమంగా తవ్వకాలు చేశారు. దీన్ని గ్రామంలో కొందరు అడ్డుకునే ప్రయత్నం చేయగా పంచాయతీ కింద తీస్తున్నామని ధీమాగా చెప్పారు. రేపు రాష్ట్రంలో వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, దిక్కున్నోడికి చెప్పుకో ? అంటూ బెదిరించారు. విషయం దేవదాయ శాఖ అధికారులకు తెలిసింది. మట్టిని ఎలా తవ్వుతారని గుమస్తాను పంపి హెచ్చరించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో చేసేది లేక ఈవో శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చి అక్రమ మట్టి తవ్వకాల్ని ఆపించారు. దేవదాయ శాఖ అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లాడ్జీలు, రిసార్ట్స్‌ల్లో పోలీసుల తనిఖీలు



లాడ్జిలో రికార్డులు పరిశీలిస్తున్న సీఐ శేషగిరిరావు

చీరాల: నియోజకవర్గంలోని లాడ్జీలు, రిసార్ట్స్, హోటల్స్‌లో ఆదివారం రాత్రి పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి, రికార్డుల్ని పరిశీలించారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్ నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు లాడ్జీలు, రిసార్ట్స్, హోటల్స్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు మాట్లాడుతూ కౌంటింగ్ రోజున అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా అన్ని భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లాడ్జీలు, రిసార్ట్స్‌ల్లో ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు, తరచూ ఘర్షణ పడే వ్యక్తులు, పాత నేరస్తులు ఉన్నారేమోనని ఆరా తీస్తున్నట్లు చెప్పారు. పాత నేరస్తులు, అనుమానితుల వివరాలను వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని లాడ్జీల నిర్వాహకులకు తెలిపారు. గ్రామాల్లో ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు అనుమానాస్పదంగా గానీ, గుంపులుగా గానీ సంచరిస్తే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు లేదా 100, 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆయన వెంట రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

బైక్ అదుపుతప్పి మత్స్యకారుడి మృతి

చీరాల అర్బన్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన సోమవారం వాడరేవు–ఊటుకూరి సుబ్బయ్యపాలెం రోడ్డులో చోటుచేసుకుంది. ఈపూరుపాలెం రూరల్ ఎస్ఐ ఎం.శివకుమార్ వివరాల మేరకు.. వేటపాలెం మండలం ఊటుకూరి సుబ్బయ్యపాలేనికి చెందిన వి.బాలాజీ (45) సోమవారం వ్యక్తిగత పనుల నిమిత్తం వాడరేవు వచ్చి తిరిగి గ్రామానికి పయనమయ్యాడు. మార్గం మధ్యలో స్పీడ్ బ్రేకర్ వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాలై అక్కకక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

300 మంది దివ్యాంగులకు కృత్రిమ చేతుల పంపిణీ



కృత్రిమ చేతులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మంగళగిరి: దేశంలోనే తొలిసారిగా 300 మంది దివ్యాంగులకు కృత్రిమ చేతులు పంపిణీ చేయడం అభినందనీయమని పలువురు కొనియాడారు. పట్టణంలోని వీజేటీఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో రూ.1.35 కోట్లతో జర్మనీకి చెందిన ద హ్యాండ్స్‌ప్రాజెక్టు సహకారంతో కృత్రిమ చేతులను (జెమ్ ఎంకే 1 హ్యాండ్స్) పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ పీడీజీ డాక్టర్ రవి వడ్లమాని, డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.శరత్‌చౌదరి, డాక్టర్ ఎస్‌వీ రామ్‌ప్రసాద్, పీడీజీ అన్నే రత్న ప్రభాకర్, ఐపీడీజీ తాళ్ళ రాజశేఖర్‌రెడ్డి, పీడీ ఆర్.ఆర్. వేణుగోపాల్ యలమంచిలి, విజేటీఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల గౌరవ అధ్యక్షుడు డాక్టర్ గోలి రామ్మోహన్‌రావు, ప్రాజెక్ట్ చైర్మన్ ఇసునూరి అనిల్ చక్రవర్తి పాల్గొన్నారు. కృత్రిమ చేతులు పంపిణీ చేసి ప్రసంగించారు. వారంపాటు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. జర్మనీ, న్యూజిల్యాండ్, ఆఫ్రికా దేశాల నుంచి టెక్నీషియన్లు వచ్చి బాధితులకు కృత్రిమ చేతుల వాడకంపై అవగాహన కల్పించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి గాజుల శ్రీనివాసరావు,పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ మెగా లోన్ మేళా

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఈనెల 22న బుధవారం ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యాన మెగా లోన్ మేళా నిర్వహించనున్నట్లు చాబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డాక్టర్ దాసరి దేవరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లకు మద్దతుగా తాము మెగా లోన్ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దీనిలో పాల్గొనే వారికి ఉచిత ప్రవేశ రిజిస్ట్రేషన్ సౌకర్యం ఉంటుందని వివరించారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఈనెల 22న సోమవారం ఉదయం 10 గంటలకు నోరీ హాస్పిటల్ సమీపంలోని ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జరిగే మెగాలోన్ మేళాకు హాజరు కావాలని కోరారు. మెగాలోన్ మేళాలో పాల్గొనేందుకు ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో స్వయంగాగానీ 79959 15450, 89197 37517 నంబర్లలోగానీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందిగా ఆయన కోరారు.

ఈదురుగాలుల బీభత్సం

నకరికల్లు: మండలంలో సోమవారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలులు వీచడంతోపాటు భారీ వర్షం కురిసింది. ఈదురుగాలుల ధాటికి చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. పలుచోట్ల విద్యుత్ తీగలు తెగి స్తంభాలు విరిగిపడ్డాయి. పలుగ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

పోలింగ్ రోజు గొడవలపై విచారణ

తాడేపల్లి రూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధితో పాటు దుగ్గిరాల మండలంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు జరిగిన గొడవలపై డీఎస్పీ సీహెచ్ రవికాంత్ పలు ప్రాంతాల్లో సిబ్బందితో సోమవారం విచారణ చేపట్టారు. మే 13న పలు పోలింగ్ కేంద్రాల వద్ద కొందరు గొడవలు సృష్టించి దాడులకు పాల్పడ్డారు. వారు ఏ పార్టీకి చెందిన వారు, జరిగిన గొడవలు ఏమిటి? ఎవరెవరు చేశారు? ఎంతమంది పాల్గొన్నారు ? అనే వివరాలను సేకరించారు. కొందరు జూన్ 4న దాడులు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో ముందుగానే పసిగట్టి అనుమానితులకు తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చేందుకు పోలీసులు కసరత్తు చేపట్టారు. అనుమానితుల పేర్లు సేకరిస్తున్నట్లు సమాచారం.

మానసిక వైద్యుల సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ వడ్డాది



డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్



డాక్టర్ పసుపుల సాయికిరణ్

గుంటూరు మెడికల్: మానసిక వ్యాధి వైద్య నిపుణుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సెక్రటరీగా డాక్టర్ పసుపుల సాయి కిరణ్, కోశాధికారిగా డాక్టర్ నెక్కంటి నిమిషా ఎన్నికయ్యారు. గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్, మిగతా ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేయడం గమనించదగిన విషయం. జాయింట్ సెక్రటరీగా డాక్టర్ జి.జగదీష్ ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గాన్ని సోమవారం గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల విభాగాధిపతి డాక్టర్ నీలి ఉమాజ్యోతి, పలువురు మానసిక వ్యాధి వైద్య నిపుణులు అభినందించారు. మానసిక సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించి వ్యాధుల బారిన పడకుండా చైతన్యం కల్పిస్తామని డాక్టర్ వెంకటకిరణ్ తెలిపారు. యువ వైద్యులు, వైద్య విద్యార్థులకు అకడమిక్ కార్యక్రమాల్లో భాగంగా ప్రతినెలా సీఎంఈలు నిర్వహించి వారిలో నైపుణ్యాన్ని పెంపొందిస్తామన్నారు. సంఘం బలోపేతం కోసం కృషి చేస్తామని వెల్లడించారు.

జిల్లా ఎస్సీ,ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షుడిగా భాస్కరరావు



క్రోసూరు: పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షుడిగా అచ్చంపేట మండలం గ్రంథసిరి గ్రామానికి చెందిన చిలకా భాస్కరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు నియామకపత్రాన్ని భాస్కరరావుకు అందజేశారు. రాజారావు మాట్లాడుతూ జిల్లా ఎస్సీ, ఎస్టీ ప్రజల హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమాలు, న్యాయపరమైన సలహాలు అందించేందుకు కృషి చేసే బాధ్యతలను భాస్కరరావుకు అప్పగించినట్లు తెలిపారు. భాస్కరరావు స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ ప్రజలకు అన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

కౌన్సిలర్ ద్విచక్రవాహనాన్ని దహనం చేసిన దుండగులు



మాచర్ల: మండలంలో సోమవారం ఉదయం పదో వార్డు కౌన్సిలర్ మహంకాళి పిచ్చయ్య ఇంటి ముందు ఉన్న ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని దుండగులు దహనం చేశారు. ఇది గమనించిన అక్కడే ఉన్న వృద్ధురాలు కేకలు వేసింది. మహంకాళి పిచ్చయ్య వెంటనే బయటకు వచ్చి నీళ్లు చల్లి మంటలను అదుపు చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికీ పశువుల ఆసుపత్రి వెనుక ఉన్న కౌన్సిలర్ ఇంటి ముందు ఉంచిన వాహనాన్ని దహనం చేయడం చర్చనీయాంశంగా మారింది. కౌన్సిలర్ పిచ్చయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఎవరు చేశారనే దానిపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. పట్టణంలో ఉద్రిక్తతల నేపథ్యంలో పోలీసుల బందోబస్తు ఉన్నప్పటికీ ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం భయాందోళనలకు గురి చేస్తోంది

మాచర్లలో కొనసాగుతున్న 144 సెక్షన్

- భారీ సంఖ్యలో పోలీసుల పహారా
- పలు ఇళ్లల్లో సోదాలు

మాచర్ల: మాచర్ల పట్టణంతోపాటు పలు ప్రాంతాల్లో 144 సెక్షన్ సోమవారం కూడా అమలుచేశారు. ఎన్నికల నేపథ్యంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో జిల్లా పోలీసుల ఉన్నతాధికారులు 144 సెక్షన్ అమలు చేస్తున్న విషయం విదితమే. పట్టణంలో టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఎక్కడికక్కడ వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. నిబంధనలు పాటించని వాహనదారులపై జరిమానాలు విధిస్తున్నారు. అక్కడక్కడ చిన్న చిన్న సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం స్పందిస్తోంది. పట్టణంలో పలు ఇళ్లల్లో రెండు రోజులుగా తనిఖీలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లల్లోనూ తనిఖీలు చేశారు. ప్రముఖ నాయకుల ఇళ్లతో పాటు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఇళ్ల వద్ద బందోబస్తు ఏర్పాటుచేశారు. రింగ్‌రోడ్డు సెంటర్, పాలవాయి జంక్షన్, గుంటూరు రోడ్డు, నెహ్రూనగర్, అంబేద్కర్ సెంటర్, బస్టాండ్ సెంటర్, తూర్పు బావి తదితర ప్రాంతాల్లో పోలీసులు మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

బాలికల ఆశ్రమ పాఠశాలలో చేరికకు దరఖాస్తుల ఆహ్వానం

వెల్దుర్తి: పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల హెచ్ఎం పి పద్మ కోరారు. సోమవారం ఆమె ఐటీడీపీ పాఠశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2024–25 విద్యా సంవత్సరంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో చేరేందుకు 21-5-2024 నుంచి 30-5-2024 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఈ పాఠశాలలో అన్ని తరగతులకు ఎస్టీ బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. బీసీలు 3వ తరగతిలో ఆరు, 4వ తరగతిలో ఆరు, ఎస్సీలు 3వ తరగతిలో ఆరు, 4వ తరగతిలో ఆరు, 5వ తరగతిలో ఐదు, ఓసీలు 3వ తరగతిలో ఆరు , 4వ తరగతిలో ఆరు, 5వ తరగతిలో మూడు, 7వ తరగతిలో నాలుగు సీట్లు ఖాళీలు ఉన్నాయని పద్మ వివరించారు . అర్హులైన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

డీఎస్పీల నియామకం

నరసరావుపేట: ఎన్నికల సందర్భంగా జిల్లాలో చోటుచేసుకున్న హింసాత్మక సంఘటనలకు బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేసిన వారి స్థానంలో నూతన అధికారుల్ని నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పల్నాడు దిశ డీఎస్పీగా పనిచేస్తున్న ఎం.సుధాకరరావును నరసరావుపేట డీఎస్పీగాను, ఏసీబీకి అటాచ్ చేసిన కాకినాడ ఎస్సీ, ఎస్టీ సెల్ అధికారి సీహెచ్.శ్రీనివాసరావును గురజాల డీఎస్పీగా నియమించారు. పల్నాడు ఎస్బీ సీఐలుగా బండారు సురేష్‌బాబు, యు.శోభన్‌బాబు, కారంపూడి ఎస్ఐగా కె.అమీర్, నాగార్జునసాగర్ ఎస్ఐగా ఎం.పట్టాభిని నియమించారు. వీరిలో కొందరు అధికారులు నూతన జిల్లా ఎస్పీ మలికా గార్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నరసరావుపేట డీఎస్పీ బాధ్యతల స్వీకారం



నరసరావుపేటటౌన్: నరసరావుపేట డీఎస్పీగా ఎం.సుధాకరరావు సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన వీఎస్ఎన్ వర్మను ఎన్నికల సందర్భంగా చెలరేగిన హింసా సంఘటనలకు బాధ్యులను చేస్తూ కమిషన్ సస్పెండ్ చేసింది. ఆయన స్థానంలో పల్నాడు జిల్లా దిశ డీఎస్పీగా పనిచేస్తున్న సుధాకరరావును నియమించింది. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని చెప్పారు.